ప్రజల మాట ప్రగతి బాట

ఎల్లారెడ్డి నియోజకవర్గం

## త్రిలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎల్లారెడ్డి, నవంబర్ 16: నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు గ్రామ శివారులో ఉన్న త్రిలింగేశ్వర ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివునికి ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త దత్తు, నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో అన్నదానం ప్రారంభం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గురుస్వామి హోటల్ రాజు

సదాశివనగర్, నవంబర్ 16: సదాశివనగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం కార్యక్రమాన్ని గురుస్వామి హోటల్ రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప ఆలయంలో గత సంవత్సరం దాతల సహకారంతో అన్నదానం ప్రారంభించామని చెప్పారు. ఈసారి కూడా దాతలు ముందుకు రావడంతో రెండో ఏడాది కూడా అన్నదానం చేపడుతున్నామని అన్నారు. అయ్యప్ప మాలధారులతోపాటు భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

## యాసంగి పంటల సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి

గాంధారి, నవంబర్ 16: మండలంలోని గుర్జాల్‌లో ఉన్న రైతువేదిక భవనంలో యాసంగి పంటల సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి మాట్లాడారు. రైతులు సాగుచేసే మక్కజొన్న, జొన్న, శనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు పువ్వు, కుసుమలు, గోధుమ తదితర పంటలు సాగు చేసే విధానాన్ని వివరించారు. యాసంగి పంటలకు ఎండు తెగులు సోకకుండా ముందస్తుగా ట్రైకో డర్మా విరిడే 5 నుంచి 10 గ్రాముల మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలని, అనంతరం విత్తుకోవాలని సూచించారు. రైతులు మేలైన వంగడాలను వాడాలన్నారు. అనంతరం ఆయిల్ పామ్ పంట సాగు విధానం, సబ్సిడీ వివరాలను ఆయిల్‌పామ్ కంపెనీ మేనేజర్ మల్లీశ్వర్‌రావు రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నరేశ్, ఏఈవో విఘ్నేశ్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సురేందర్‌తో కృష్ణాజివాడి గ్రామస్తులు



వృద్ధులను పలుకరిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

# కేసీఆర్ మరోసారి సీఎం కావాలి



- బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్
- కృష్ణాజివాడి, బ్రహ్మాజివాడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం
- రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఘన స్వాగతం పలికిన ప్రజలు



ఎమ్మెల్యే సురేందర్‌కు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

తాడ్వాయి, నవంబర్ 16: రాష్ట్ర ప్రజలు మరింత అభివృద్ధి సాధించాలంటే, పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలన్నా కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండలంలోని కృష్ణాజివాడి, బ్రహ్మాజివాడి గ్రామాల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా కృష్ణాజివాడి గ్రామ సమీపంలో ఉన్న రాజరాజేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. యువకులు, ప్రజలు డప్పు వాయిద్యాలతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఆయన ప్రజలకు వివరించారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిందర్‌రెడ్డి, ఎంపీపీ రవి, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, సొసైటీ చైర్మన్ కపిల్‌రెడ్డి, నాయకులు భూషణం, నర్సారెడ్డి, నర్సింహులు, వెంకట్‌రెడ్డి, నారాయణరావు, రాంరెడ్డి, చంద్రం, వెంకట్‌రాంరెడ్డి, సాయిరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

## లెక్కలు పక్కాగా ఉండాలి

### ఎన్నికల రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 16: ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులు పెడుతున్న ఖర్చుల లెక్కలు పక్కాగా రాయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని రిటర్నింగ్ కార్యాలయంలో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, పార్టీ ఏజెంట్లతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలు ముగిసే వరకూ నిర్వహించాల్సిన విధులను వివరించారు. రోజువారీగా ప్రతి ఖర్చునూ రాయాలని, 17, 22, 25వ తేదీల్లో వివరాలను చూపించాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం లెక్కలు రాసుకోవడానికి మెటీరియల్‌ను, ఓటరు జాబితాను అందజేశారు. అనుమతి లేనిదే ర్యాలీలు నిర్వహించవద్దన్నారు. సమావేశంలో ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జగదీశ, తహసీల్దార్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులు, ఏజెంట్లతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్



మాట్లాడుతున్న డీఎల్పీవో సురేందర్, ఇన్‌సెట్‌లో.. మౌలాన్‌ఖేడ్‌లో జీపీ రికార్డులు తనిఖీ చేస్తూ..

## గ్రామ పంచాయతీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్
- పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 16: గ్రామపంచాయతీలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎల్పీవో సురేందర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ పోర్టల్స్, లాగిన్స్, రోప్, జెమ్ పోర్టల్, సాంకేతిక విషయాలపై ఆయన అవగాహన కల్పించారు. ఎంపీవో ప్రకాశ్, మండలంలోని ఆయా జీపీల కార్యదర్శులు పాల్గొన్నారు.

***జీపీ తనిఖీ..***

మండలంలోని మౌలాన్‌ఖేడ్ గ్రామాన్ని డీఎల్పీవో సురేందర్ గురువారం సందర్శించారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ పనితీరు బాగున్నదని ఆయన కితాబిచ్చారు. పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి ఉన్నారు.